# కళారాధకుడు

(కథానిక)

ఇప్పటికింకా సినిమాలు నాటకాల మీద దాడి ప్రారంభించలేదు. ప్రజలు ఊరూరా, యింటింటా ఉత్తమనటుల పేర్లు గొప్పవాళ్లతో జతపరచి చెప్పుకునే రోజులవి. నటులలో ఏ రాజకీయాలూ లేవు. క్రమబద్ధమైన నటనతో అహంభావం లేకుండా నటులు రంగపూజ చేసే రోజులవి. ఆనాటి ఉత్తమ నటులను లెక్కవేస్తే మొదటి పదిమందిలోనూ పూర్ణ విశ్వనాథరావు వచ్చితీరుతాడు. అతన్ని అందరూ విశ్వనాథం అనేవారు. తాయారమ్మ అతన్ని 'విశ్వం' అంటూండేది. విశ్వనాథం జన్మతః నటుడు. కాదు-నటులలో నాయకుడు. సంస్కృతాంధ్రాలలో నాటక లక్షణాలు, రసాలు, భావాలు అన్నీ క్షుణ్ణంగా వల్లించి నరాలకు పట్టించుకున్నవాడు. చిన్నతనంలో స్కూల్లో మానిటర్‌గా వున్నప్పుడే అందరూ అతనిలో రాజఠీవి గమనించేరు. రానురాను రంగస్థలంమీద రాజుగా మారేడు. అతనిలో ప్రతిభ గుర్తించే, తండ్రి అతని నాటకాల వ్యాపత్తిని మందలించలేదు. తండ్రి యిచ్చిన ప్రోద్బలంతో విశ్వనాథం క్రమంగా విజయవిహారం మొదలుపెట్టేడు. ఇంతకీ అతని నాటకాలు విజయవంతం కావడానికి కిటుకు వేరే వుందంటారు కొందరు అసూయాపరులు. అది తాయారమ్మ రూపురేఖావిలాసాలు. అలాంటి రూపవతి నటిస్తూంటే ఏ నాటకం రక్తికట్టదూ? అనేదే వీరివాదం? నిజానికి ఇది రూపాయకు పావలా వంతు కూడా సిసలు కాదు.

ఇంతకీ తాయారమ్మ యెవరో ఇప్పటికైనా చెప్పకపోతే బాగుండదు. ఆమె ఒక ఒప్పుల కుప్ప, వొయ్యారిభామ. మందస్మిత. మందయాన. ఆమె తల్లి జానకమ్మ విశ్వనాథం తల్లికి స్నేహితురాలు. జానకమ్మ వితంతువయినా ఆవొక్క కూతురునీ కనిపెట్టుకుని చావాలేక బ్రతకాలేక కాలం గడుపుతూంది. కుట్టు మిషనొకటి పెట్టుకుని, బట్టలు కుట్టుకుంటూ ఉదర పోషణ జరుపుకునేది. విశ్వనాథం తల్లి పాపం, కేన్వాసుచేసి జానకమ్మ రెక్కా, డొక్కా ఆడేలాగ చూస్తుండేది. చిన్నతనంనుంచీ తాయారమ్మలోని కళని గుర్తించిన విశ్వనాథం ఆమెను రంగంమీదకెక్కించి వాళ్ళకే లోటూ లేకుండా ధనం యిస్తుండేవాడు. నిజానికి స్త్రీలలో, నిద్రాణమైన కళాకాంతుల్ని తాయారమ్మలో పైకి తీసినవాడు విశ్వనాథమే. నాటక లక్షణాలు, రీతులు, నాయికాలక్షణాలు, అలంకారాలు, ఉద్దీపనవిభావాలు ఆమెకు బోధించి క్రమబద్ధంగా తాయారమ్మని ఉత్తమనటిగా చేసినవాడు విశ్వనాథమే. ఆమె క్రొత్తలో రంగస్థలమ్మీద చాలా సిగ్గుపడేది, భయపడేది. చెప్పవలసిన పార్టు మరిచిపోయి, ప్రాంప్టింగ్ కూడా అందుకునేది కాదు. ప్రక్కనున్న విశ్వనాథమే ఎల్లాగో అందిచ్చి నాటకాన్ని ఓ గట్టుకీడ్చేవాడు. ఒకనాడు తాయారమ్మ చంద్రమతి వేషంలో జనసమూహాన్ని చూసి భయపడి మూర్ఛపోయినంతపని చేసింది. ప్రేక్షకులు కొంచెంలో గోలచేసివుందురు. కాని, హరిశ్చంద్ర పాత్రధారి విశ్వనాథం ఆమెనెత్తుకుని "నా రాణి కష్టములు సైపజాలక మూర్ఛపోవుచున్నది. ఆ జలాశయము వద్దకు గొనిపోయి సేదదీర్చెదగాక!" అంటూ సమయస్ఫూర్తితో లోపలకు తీసుకుపోయేడు. ఇంకొకసారి మాళవికాగ్నిమిత్రంలో ఆమె సమాసాలు సరిగా పలకలేక వదిలేసింది. నాటకమయ్యేక విశ్వనాథం కోపపడితే "నాకొద్దీ నాటకాలు" అంటూ లేచింది. విశ్వనాథం మళ్ళీ ఆమెకళ్ళలోకి చూస్తే తిరిగి శాంతించింది. రానురాను తాయారమ్మ ఉత్తమనటిగా తయారయింది. విశ్వనాథానికి ఇంచుమించు సమఉజ్జీగా నాయికా

జయంతి శ్రీరామమూర్తి

పాత్రలో రాణిస్తూంది. దానితో విశ్వనాథం ట్రూపు పేరు ప్రతిష్ఠలు ఇనుమడించేయి. మొదట్లో ముక్త్యేశ్వరం నుంచి ముక్కామల వరకూ ప్రాకిన పేరు రెండేళ్ళలో కోరాపుట్టినుండి కొంకణం వరకూ, బందరునుంచి పోరు బందరు వరకూ ప్రాకిపోయింది. ఒకనాడా ట్రూపు ప్రతిష్ఠా పురంలో ఉత్తర రామచరిత్ర నాటకమాడింది. కవులు, గాయకులు, పండితులు ఎందరెందరో సభనలంకరించారు. ఆదిలోని "పరాబ్రహ్మ" నుంచి అంతంలోని "దీర్ఘాయురస్తు" వరకూ ఎవ్వరూ కదలలేదు. ఆ రాత్రి విశ్వనాథం "రాముడు"గా ప్రేక్షకహృదయంలో విహారం చేసేడు. ధీరోదాత్త నాయకుడు శ్రీరాముడు "అవికత్థనుడు, క్షమావంతుడు, అతిగంభీరుడు, మహాసత్త్వుడు, స్థేయుడు, నిగూడాభిమానుడు, దృఢవ్రతుడు" అనే అన్నిలక్షణాలతోనూ గోచరించేడు విశ్వనాథం పండితులకు. తాయారమ్మ కూడా అద్భుతంగా నటించింది. అంతదివ్యంగా ఆమె యెన్నడూ నటించలేదు. "ఈ నాటకంలోని రసము కరుణా? కరుణ విప్రలంభమా?" అని మళ్ళీ చర్చించడం మొదలు పెట్టేరు పండితులు. నాటకమయిపోయేక రాముని వేషంలో వున్న విశ్వనాథాన్నీ, సీత వేషంలో వున్న తాయారమ్మనీ స్టేజీమీదికి పిలిచి ఆశీర్వదించేరు పెద్దలు. మర్నాడు ప్రతిష్ఠాపురంలో పెద్దసభ జరిగింది. ఎందరెందరో పండిత ప్రకాండులు, కవి మార్తాండులు, గాయక శిఖామణులు, పత్రిక శిరోమణులు, రాజకీయ దురంధరులు, రెడ్డికుల భాస్కరులు సభనలంకరించేరు. ఎందరెందరో విశ్వనాథం ప్రతిభ నుగ్గాటించేరు. అనంతరం అభినందన పూర్వకంగా విశ్వనాథానికి గండపెండేరం తొడిగేరు.

* * *

రెండేళ్ళలో విశ్వనాథం పదివేల రూపాయలు నిలవ చేసేడు. జానకమ్మకు మూడు వేలిచ్చాడు. కంపెనీలో ప్రతివారూ తలో వెయ్యా వెనకేసుకున్నారు. కంపెనీ బాగా నడుస్తోంది. రోజులు మారుతున్నాయి. ఇంతలో సినీమాలొక్కటొక్కటే వచ్చిపడుతున్నాయి. చేజిక్కిన నటీనటుల నమాంతంగా ఎత్తుకుపోతున్నాయి. ప్రజల అభిరుచులు మారుతున్నాయి. తాయారమ్మ మారిపోతూంది. ఆమె విశ్వనాథాన్ని ఇదివరకటంత గౌరవంగా చూడడంలేదు. అతనంటే కొంచెం సందేహిస్తూ, భయపడుతూ, జుగుప్సాపూర్వకంగా దూర దూరంగావుంటోంది. ఉబుకుతూన్న యవ్వనం ఆమె కళ్ళల్లో ప్రకటిత మవుతోంది. అదిచూసి విశ్వనాథం తన పెళ్ళిమాట ఆమెతల్లితో చెబుదామనుకున్నాడు. కాని, తాయారమ్మ ప్రవర్తన అతన్ని దూరదూరంగానే వుంచేస్తోంది. ఎన్నడో తనదనుకుని సానబెట్టిన ఒకరత్నం ఎవరో తీసుకు పోతున్నట్లు భావిస్తున్నాడు విశ్వనాథం. రోజులుగడుస్తున్నకొద్దీ తాయారు మారుతోంది. సినీమాలు చూస్తున్నకొద్దీ ఆమె మనస్సులో ఊటలూరుతున్నాయి. దానికితోడు వందిమాగధులు కొందరుచేరి స్తోత్రపాఠాలు చేస్తున్నారు. "విశ్వనాథం ప్రతిభకి తానే కారణమనీ, తనపేరు మరుగుపరచి అతను పైకి వస్తున్నాడనీ" ఆమెలో ఎవరో విషబీజాలు నాటారు. పట్నంలో సినీమా కంపెనీలో పని చేస్తున్న ఒకాయన తరుచు ఆమె యింటిచుట్టూ తిరుగుతున్నాడు. ఇదంతా చూసీ చూడనట్లూ వినీవిననట్లు ఊరుకున్నాడు విశ్వనాథం. అయినా అతనిలో ఏదోఅశాంతి రగులుతూంది. "పోనీ. ఆమెకు నామీద ప్రేమలేకపోయినా, నా రంగస్థలమ్మీదేనా అభిమానముంటే అదే పదివేలు" అనుకుని సంతృప్తి పొందడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంతలోఒకరాత్రి నాటకమయిపోయేక విశ్వనాథం తాయారమ్మని బండిలో తీసుకువెళ్ళి ఆమె యింటివద్ద దిగపెట్టేడు. అప్పటికి రాత్రి నాలుగు గంటలయింది. తాయారు వెను తిరిగి "మీతో ఒక మాట చెబుదామనుకుంటున్నాను. నేనింక మీ నాటకాల్లో వేషం వెయ్యను" అంది.

విశ్వనాథం నిలువునానీరై పోయేడు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని, "కారణం" అన్నాడు.

"చెప్పవలసిన అవసరం లేదు నాకు. నా యిష్టం, అంతే" అంది తాయారు. ఒకనాడు స్టేజిమీద జనాన్ని చూసి భయపడిన తాయారు, విశ్వనాథంతో అంతకటువుగా మాట్లాడడం అదే మొదటిసారి. అది వాగ్వాదానికి సమయం కాదనుకుని,

"వెళ్ళి నిద్రపో. అలసిపున్నావు. రేపు మాట్లాడుకుందాం" అని యింటిదారి పట్టేడు విశ్వనాథం.

ఆ "రేపు" మళ్ళీ విశ్వనాథం జీవితంలో రాలేదు తాయారమ్మతో మాట్లాడుకుందుకు. ఆ తెల్లవారగట్లే ఆమె హార్మోనిస్టు నరసింహులును తోడు తీసుకుని రైలెక్కేసింది. ఆ వార్త విని విశ్వనాథం సగమైపోయేడు. లోకంలో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదు. వారంరోజు లున్నాక జానకమ్మ అతని చేతికో వుత్తరం యిచ్చి చదవమంది. తాయారు పట్నంనుంచి రాసింది. తానొక సినీమా కంపెనీలో నెలకు నాలుగు వందలకు కుదిరినట్లూ తల్లిని వెంటనే రమ్మనీ వుంది. అందులో విశ్వనాథం మాటేలేదు. ఆతర్వాత జానకమ్మ పట్నానికి మకాం మార్చేసింది. విశ్వనాథం యివన్నీ మౌనంతోనే సహించేడు. తర్వాత అతని నెత్తిమీద యింకా బలమైన దెబ్బలు పడ్డాయి. తల్లితండ్రు లొకరి తర్వాత ఒకరు స్వర్గం చేరుకున్నారు. విశ్వనాథం ఒక సంవత్సరం నాటకాలే వెయ్యలేదు.

ఆపైన కొంచెం తేరుకుని అతను కంపెనీకి తిరిగి సామగ్రి పోగుచేసుకుంటున్నాడు. తన పరివారంలో చేరమని నటీనటులకు పత్రికాముఖాన విజ్ఞప్తి చేశాడు. కొద్దిమంది గవాయి పాటగాళ్లూ, సినిమాలో ఛాన్సు రాకని కొందరు కురూపవతులు వచ్చారు. ఒకనాడు నరసింహులు వచ్చి "క్షమించండి గురువుగారూ" అన్నాడు.

"ఏం వచ్చేశావు? మరి తాయారమ్మ ఏదీ?"

"ఒక ఫిలిమ్ కంపెనిలో పని చేస్తూంది. ఒక డైరెక్టరు రమ్మని వుత్తరం రాస్తే వెడుతూ తోడు రమ్మంది."

"మరి నువ్వుకూడా అక్కడే వుండలేక పోయావూ?"

"మా యింటి విషయాలెల్లా చూసుకోను బాబూ పట్నంలో మకాం పెడితే?"

విశ్వనాథం మళ్ళీ అడగలేదు. తాయారమ్మని గురించి కూడా తప్పుగా భావించలేదు. "కాలంతో బాటు మనుష్యులు మారవలసిందే. కాని ఆ మార్పు ఒకే రాత్రిలో రాక క్రమక్రమంగా వస్తే బాగుంటును. అయినా ఆమె నా శిష్యురాలు. ఎక్కడ వుంటేనేం కళారాధన చెయ్యవలిసిందే" అనుకుని సంతృప్తి పొందేడు.

విశ్వనాథం మళ్ళీ స్వంత డబ్బుతో కంపెనీ పెట్టి "పరాబ్రహ్మ" పట్టేడు. ఈసారి యిదివరకులాగ సొమ్ము రావడం లేదు. ప్రజలు సినీమాల కెగబడుతున్నారు. నాటకాల నుద్ధరించాలని బల్ల గుద్దే వ్యక్తులు కూడా టిక్కట్లు అమ్మేవా రొస్తే "అమ్మో! మూడు రూపాయలే? దాంతో నాలుగు సినీమాలు చూడవచ్చు కాదండీ" అంటున్నారు. ఆలాగని ఆ మహనీయులు నాటకాలు, వాటి ఆవశ్యకత, పునరుద్ధరణ మొదలైన విషయాలమీద పత్రికలలో పేజీలు నింపక పోవడంలేదు. ఏది ఏమైనా విశ్వనాథం నాటకా లాడుతూనే వున్నాడు. ఖర్చులే మిగులుతున్నాయి. విశ్వనాథంలో ఎట్టి అపజయపు సూచనలూ లేవు. "తాతల నాటి క్షేత్రములెల్ల" తెగనమ్మి, "దోసిళ్ళతో తెచ్చిపోసినాడు." "తండ్రి కట్టిన యిల్లు దాయాదులకు విక్రయించి" కొత్త దుస్తులు "చేయించినాడు." "తాతగారిచ్చిన అంటు మామిడితోట" అప్పులవాళ్ళకు "రాసియిచ్చినాడు." తన వస్తువులు సర్వం, రిష్టు వాచీతో సహా అర్పించినాడు. ఎన్ని చేసినా ఈమాటు కంపెనీ ఆట్టే కాలం నిలవలేదు. నీరెండుతున్న కొలనులోని కప్పల్లాగ ఎవరి దారి వారు చూసుకున్నారు నటీనటులు.

* * *

కాల వైపరీత్యంవల్ల విశ్వనాథ మిప్పుడు కిరాయిమీద యితర కంపెనీలలో నటిస్తున్నాడు. ఒక వేషాని కతనికి వంద రూపాయలిస్తారు. దాన్ని తెచ్చుకుని మళ్ళీ నాటకం దాకా ఏ నెల రోజులో మార్చుకు తింటుంటాడు. సరియైన తిండిలేక శరీర దారుఢ్యం కూడా సన్నగిల్లుతోం దతనికి.

ఇది ఇలా వుండగా, అక్కడ తాయారమ్మ తరంగిణీ దేవిగా మారి తారాపథాన్ని చేరుకుంది. ఆమెకు ఫిల్ముకు లక్ష రూపాయలిస్తారని వినికిడి. ఆమె మూడు జానపద చిత్రాల్లో నటించింది. అందులో విశ్వనాథం చూసింది

ఒకటే-"మంత్ర భజంత్రీ" అనేది. కథావస్తువు అల్పమే. ఒక రాకుమారుడు (నటుడు కుణపదంతుడే) దైవ దత్తమయిన ఒక భజంత్రీ వాయించి ఒక అప్సరసను లొంగదీసుకుని పెళ్లి చేసుకుంటాడు. అందులో అప్సరసగా నటించింది తరంగిణి-కాదు తాయారమ్మ. విశ్వనాథాని కాచిత్రం చూసినంతసేపూ జీవితం మీదనే విరక్తి పుట్టింది. ఆమె ఒప్పించిన దేదీ లేదా చిత్రంలో. కొంత నృత్యం వుంది. అది భరతనాట్యం కాదు. మణిపురీ కాదు. అలరిప్పూ కాదు. మార్వాడీ నృత్యం అసలే కాదు. కథాకళి అంతకన్నా కాదు. దాని బాణి దానిదే. ఏవేవో కామోద్రిక్తపు చూపులు, వక్షోజ ప్రదర్శనాలు, ఎగిరెగిరి గంతులు! ఆ చిత్రం చూసిననాటి రాత్రి విశ్వనాథానికి నిద్ర రాలేదు. తాను నిర్మించిన కళా సౌధాన్ని తాయారు కూలద్రోసేసింది. "కేవలం డైరెక్టరు చేతిలో కీలుబొమ్మగా తాయారు ధనం కోసం, ఎలాగాడిస్తే అలాగ కెమెరాముందు గంతులేసిందిగా!" అనుకున్నాడు. ఆమెమీద కోపం కలిగింది. కాని, నిస్సహాయత అతన్ని క్రుంగదీసింది.

* * *

రోజులింకా మారిపోయేయి. ఇలా వుండగా కళారాధనా సంస్థ వార్షికోత్సవాలు వచ్చాయి. అందరు నటులతో బాటు విశ్వనాథానికీ ఆహ్వానం వచ్చింది. ఆనాటి సభలో వెనకటి సంవత్సరంలో ఉత్తమ నటిగా తరంగిణీ దేవికి సన్మానం జరగబోతూంది. ఆమె సభా వేదికమీద సోఫాలో ఠీవిగా కూర్చుంది. నీలి రంగు ముఖమల్ షరాయి, పచ్చని చైనా సిల్కు కమీజు, తెల్లని ఉలిపిరి వోణీ, ఎర్రని పట్టు చడావులు మెడలో రత్నాల హారము. ప్రేక్షకుల కళ్ళల్లో జిగేల్ జిగేల్ మంటూంది. ఆమె తారగా మారేక అంతమంది కళ్ళముందు స్వయంగా కనిపించడ మదే ప్రథమం. సభ ప్రారంభమయింది. కార్యదర్శిగారు లేచి "ఈనాడు మన యెదుట దర్శనమిచ్చిన శ్రీమతి తరంగిణీ దేవిగారికి నా ధన్యవాదాలు. ఆమె మన నాటక రంగానికి చేస్తున్న సేవ అపారం. గత సంవత్సరం మన దేశంలోని ఉత్తమ నటిగా ఎన్నుకొని ఆమెకీ బహుమానం ఇస్తున్నాము. మీరంతా నాతో ఏకీభవిస్తారని తలుస్తున్నాను" అన్నాడు. ప్రజలు హర్షధ్వానాలు చేస్తున్నారు. తరంగిణి ప్రక్కనున్న లంబోదరుని (డైరెక్టరు) ఓరగా చూస్తూంది. ఇంతలో సభలో ఒక వ్యక్తి నిలబడి "మీతో నే నేకీభవించను" అన్నాడు ధైర్యంగా. ఎవ్వరా వ్యక్తి? దబ్బపండులాంటి శరీరచ్ఛాయ, రాజఠీవి చూపే కోర మీసాలు, తిండిలేక ఎండిన పసివాడని బుగ్గలు, ఆజానుబాహువులు ఎవరో వృద్ధనటుడై వుంటాడు? ఆ వ్యక్తి సరాసరి సభావేదికపైకి వచ్చేడు. ప్రజలు నిశ్శబ్దం వహించేరు. ఎవరో 'విశ్వనాథం' అన్నారు మెల్లగా. తరంగిణి కోపంగా చూస్తూంది.

విశ్వనాథం ప్రారంభించేడు: "తరంగిణీదేవికీ బహుమానం చెందడానికి వీల్లేదు. ఇది నాటక కళకి చెందిన బహుమతి. సినీమాకళది కాదు. ఆమె గత సంవత్సరం మన నాటకరంగానికి చేసిన సేవ యేమిటి? మీరు స్వయంగా ఆమెను ఎన్నిసార్లు స్టేజిమీద చూసేరు? ఆమెఎన్ని నాటకాల్లో నటించింది? ప్రేలుమడిచి చెప్పగలరా?" ప్రేక్షకు లొకరిమొగం ఒకరు చూసుకుంటున్నారు. "తరంగిణీదేవి చేసేది వ్యాపారం. ఆమె స్వయంగా మీకంటబడదు. మీ ఎదుట నాటకాలలో నటించదు. పవిత్రమైన రంగస్థలమ్మీది మట్టిని పూసుకోదు. అదే వర్తక రహస్యం. అదలావుంచండి. ఆమె నటించిన "మంత్రభజంత్రీ" చిత్రాన్ని తీసుకోండి. ఆమె పాత్రకి ప్రధానరసమేమిటి? శృంగారమా? కాదు. హాస్యమా? కాదు. కరుణా? అంతకన్నా కాదు" ప్రజలు హర్షధ్వానాలు చేస్తున్నారు. తరంగిణి కోపం మిన్నుముట్టుతోంది. అది మాని అధ్యక్షులు నిలబడి "క్షమించాలి. వ్యక్తిగతాభిప్రాయాలు చర్చించడానికి కలుసుకోలేదు మనమిక్కడ. కార్యక్రమం పూర్తి కావాలి. తమ భావాలు పత్రికలో ప్రకటించండి సావకాశంగా" అన్నాడు. విశ్వనాథం గత్యంతరంలేక దిగిపోయేడు. సగర్వంగా తరంగిణీదేవి బహుమానం అందుకుంది. ఆమె సభకు ధన్యవాదాలర్పిస్తూ,

"నేనిప్పుడు చెప్పవలసిందేమీ లేదు. ప్రతి

కళలోనూ అసూయాపరులుంటారు. ముఖ్యంగా ఈనాడు కిరాయినటులు చేరి మమ్మల్ని తూర్పారపడుతున్నారు. పట్టనివ్వండి. సినీమాల్లో స్థానందొరకని కిరాయినటులు పోతేగాని మన కళారంగం బాగుపడదు" అని ముగించింది. విశ్వనాథం జవాబు చెబుదామనుకున్నాడు. కాని జనం "తరంగిణీదేవికీ జై" అంటూ లేచి పోయేరు.

విశ్వనాథం ఇంటికి వచ్చేసేడు. అతనిలో ఏవో అగాధాలు ఏర్పడ్డాయి. తాయారమ్మ తన్ను అన్యాపదేశంగా కిరాయి నటుడని చెప్పింది. ఆమాటకతడు ఉత్తరం రాసేడు:

"ప్రియమైన తాయారూ,

నువ్వు నన్నలా అపార్థం చేసుకుంటావని అనుకోలేదు. నిన్నవమానపరచడం నా అభిమతం ఎన్నడూ కాదు. నీ కీర్తిలో ఎన్నడూ నాకు భాగంవద్దు. నువ్వు నా శిష్యురాలివి. ఇంతకీ కిరాయినటులన్నావే, ఎవరిని? సర్వస్వం నాటకాల్లో ధారపోసి భుక్తికినాడు నాలుగు రాళ్లు తీసుకునే నన్నా? ఒకటి మాత్రం మరవకు. నా పేరు నేను మరణించినా నాటకరంగంమీద నిలిచిపోతుంది. నియమబద్ధం కాని నీ నటన ఈనాడు కొంతకీర్తి తేవచ్చు. కాని, అది నీ యవ్వనాంతంతో అంతరించి పోతుంది. సుమా?"_

ఎంత ఎదురు చూసినా విశ్వనాథానికి జవాబు రాలేదు. పైగా తరంగిణి తరఫున కొన్ని పత్రికలు విశ్వనాథానికి వ్యతిరేకంగా కొంత ప్రచారం చేసేయి. విశ్వనాథం వాటికి జవాబు రాస్తే అవి ప్రకటించనే లేదు.

రాగాపోగా, విశ్వనాథాన్ని మనోవేదన పట్టుకు పీడిస్తోంది. మళ్ళీ నాటక సమాజం స్థాపించి తరంగిణిని మించే నటిని తయారుచేసి లోకం ముందు పెట్టాలని తపన పడుతున్నాడు. కాని చేతిలో పైసా లేదు. మునుపటి దారుఢ్యంలేదు. అయినా యేదో తెగించి ఇద్దరు శ్రీమంతులను కళారాధకులని పేరుబడ్డవాళ్లను చూస్తే "ఎందుకు బాబూ మీకీ తాపత్రయమింకా" అని నిరుత్సాహ పరిచేరు. అయినా విశ్వనాథం నిరాశ చెందక కళా సమితి స్థాపించేడు. మళ్ళీ కొందరు నటులు, ఈ మారు కాలేజీ విద్యార్థులు కొందరు చేరేరు. విశ్వనాథం క్రింద తర్ఫీదు పొందుతున్నారు. హార్మొనిస్టు నరసింహులు మళ్లీ గురుశుశ్రూషలో నిమగ్నుడయ్యేడు. విశ్వనాథం దేహస్థితి నానాటికీ తీసికట్టు అవుతోంది. నలభయ్యో పడిలోనే "అతడనేక యుద్ధముల నారితేరిన వృద్ధమూర్తి"లా కనబడుతున్నాడు. ఒకనాడు సాయంత్రపువేళ వొంట్లో బాగుండక విశ్వనాథం ఆరుబయట పండుకొన్నాడు. సూర్యుడపరాంబుధి గ్రుంకుతున్నాడు. గోధూళి రేగుతూంది. నరసింహులు జాలిగా చూస్తున్నాడు. పశ్చిమాద్రిని రక్తారుణిమ దేవతలాడబోయే నాటకంముందు ఎర్రని తెరవలె కనబడుతూంది.

"ఇక్కడ నాటకం ఆడాలీరాత్రి. వేగం రా!" అని ఎవరో పిలుస్తున్నట్లయింది విశ్వనాథానికి. అలాగే చూస్తూ విశ్వనాథం "పరాబ్రహ్మ పట్టరేమిరా?" అన్నాడు.

నరసింహులు హార్మోనియం వాయిస్తున్నాడు. శిష్యులు పాడుతున్నారు. "పరాబ్రహ పరమేశ్వర పురుషోత్తమ సదానంద..." విశ్వనాథం ధ్యానముద్రలో వున్నాడు. పాట ముగిసింది. అందరూ కలిసి "శ్రీకృష్ణ పరమాత్మకీ జై" అన్నారు. అవే విశ్వనాథం ఆఖరి మాటలు. విశ్వనాథం చనిపోయేడు. నాటక రంగాన పడిన ఒక నల్లని తెరలాగ చీకటి ఆవరించింది. విశ్వనాథం తనదారిని తాను వెళ్ళిపోయేడు. విశ్వనాథం కళాసమితినీ, అందలి నటుల్నీ, తాయారమ్మనీ అందరినీ విడిచి వెళ్ళిపోయేడు. అలాగే, ఆ కోరమీసాలతో, ఆ రాజఠీవితో, దబ్బపండులాంటి శరీరచ్ఛాయతో, ఆ గండపెండేరంతో వెళ్ళిపోయేడు.

మరునాడు పేపరులో పడింది విశ్వనాథం మరణవార్త ఫోటోలతో సహా. చాలా చోట్ల సానుభూతి సభలు జరిగేయి. పట్నంలో ఒక సభ తరంగిణీదేవిని ఆహ్వానించింది విశ్వనాథం చిత్రపటాన్ని ఆవిష్కరించడానికి. ఇంతకాలం విశ్వనాథంమీద అనవసరంగా ద్వేషం పెంచుకున్న తరంగిణి ఎందుకో అతడు తిరిగి కనిపించడంటే బావురుమంది చిన్న పిల్లలాగ. ఒక్కసారి ఎన్నడో విడచిన తన బాల్యదశ, కళారంగంలో క్రమశిక్షణ నలవరచుకొన్న యవ్వ

నవ్వు దశ ఆమె కళ్ళముందు ప్రత్యక్షమయ్యాయి. సగౌరవంగా చిత్రపటాన్ని ఆవిష్కరించి ఆమె యిల్లు చేరుకుంది. ఆ రాత్రి ఆమెకు నిద్ర పట్ట లేదు. మెత్తని పట్టు కంబళ్ళీ ఆమెకు సూదుల మయంగా గ్రుచ్చుకుంటూంది. విశ్వనాథం జ్ఞాపకం వచ్చాడు. తాను రంగస్థలం మీద అడుగు పెట్టడానికి కారకుడు విశ్వనాథం. తనలో నిద్రాణమైన కళాకాంతులను పైకితీసిన వాడు విశ్వనాథం. రంగం మీద కాలుజారే రోజుల్లో కంటికి రెప్పలా కాపాడినవాడు విశ్వనాథం. నటికి చీరకట్టు, రైక బిగింపు విధానాలు నేర్పినవాడు విశ్వనాథం. వేయేల? ఈనాడు తానార్జిస్తూన్న లక్షలు విశ్వనాథం పెట్టిన భిక్షలే. అతడు తిరిగిరాడు. అతని మాటలే మిగిలేయి-"నా పేరు నేను మరణించినా కళారంగంమీద నిలిచిపోతుంది. నియమబద్ధంకాని నీ నటన ఈనాడు కొంతకీర్తి తేవచ్చు. కాని, అది నీ యవ్వనాంతంతో అంతరించిపోతుంది సుమా!"

* * *

రోజులు మారిపోయేయి, మార్పు తప్పదు గనుక. తరంగిణీదేవి కామోద్రిక్తతను చూపే కృతకపాత్రలు ధరించడం మానేసింది. నటించే ఫిలుములు సంవత్సరానికి రెండయినా ప్రజలలో ఉన్నతభావాలు నెలకొల్పేవీ, వాళ్ళని కార్యశూరులుగా చేసేవి, భారతనారీ ప్రతిభ నుద్ఘాటించేవీ, మీదు మిక్కిలి తన వయసుకు తగినవీ అయిన పాత్రలు ధరిస్తుంది. వానిని బాగా అర్థం చేసుకుని నటిస్తుంది. కాదుమరి! ఆమె కేమి లోటు? ధనం లేదనా, ప్రతిభ లేదనా, అర్థంలేని వేషాలు వెయ్యడం?

ఆ ప్రక్క విశ్వనాథ కళాసమితి తరంగిణీదేవి ఇచ్చిన ఏభైవేల రూపాయలతో స్వంత మందిరాన్ని ఆధునిక పద్ధతులతో నిర్మించుకుని, మూడు చిలువలూ ఆరు కాయలతో నడుస్తూంది దివ్యంగా. ఆ కళాసమితి, నటులకూ, నటీమణులకు, నాటకాలవారికీ, సినిమావారికీ, కవులకు, గాయకులకు, నానా గోత్రీయులకు తమతమ భావాలు నిర్భయంగా వెలిబుచ్చి అభ్యుదయ మార్గాన పురోగమించేందుకు ఆటపట్టయింది. ఆ సమితికి తరంగిణీ దేవినే అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఆమె సినిమాలోకంలో ఎంత పనివున్నా, కొంత దృష్టిని నాటకాలమీద వినియోగించి, ఇందులో ఆరితేరిన నటీ నటులను సినిమావారి కందిస్తుంది. సినిమాలకు తగని వారిని నాటకాలలోనికి పంపించి వారికి కొంత భుక్తి కల్పిస్తుంది.

ఇంకొక విశేషమేమిటంటే ప్రతి సంవత్సరం వారంరోజులు విశ్వనాథం వర్ధంతి వార్షికోత్సవాలు జరుగుతాయి కళాసమితి మందిరంలో. ఆరోజులలో తరంగిణి స్టూడియో పనులెన్నివున్నా అట్టిపెట్టుకుని వచ్చి రెండు నాటకాలాడుతుంది. సడలిపోతూన్న యవ్వనాన్ని బిగపట్టుకుని అమోఘంగా మళ్ళీ ముగ్ధపాత్రను ధరిస్తుంది తరంగిణి - కాదు తాయారమ్మ. ఆనటన చూసి కళారంగంమీద కాలుపెట్టిన నవయువతులెన్నో విషయాలు గ్రహిస్తారు. పెద్దలు చిన్ననాటి తాయారమ్మని స్ఫురణకు తెచ్చుకుంటారు. ఆ నాటకాలాడుతున్నంతసేపూ ప్రక్కన పురుషపాత్ర ఎవరు ధరించినా ఆమె మైమరచి కళారాధకుడు విశ్వనాథమే నటిస్తున్నట్లు భావించి తన్మయత్వం చెందుతుంది.

సాంగ్లీ పట్టణములోని మునిసిపలు కౌన్సిలు సమావేశమున ఏదో ఒకవిషయమైపై వాదోపవాదాలు జరుగుచుండే సందర్భములో ఒక మెంబరు స్త్రీ మెంబరును జూచి తన మీసాలను మెలివేసినాడట. సవాలు సూచకమైన అట్టి చర్య పార్లమెంటరీ సంప్రదాయానికి విరుద్ధమనిన్నీ అట్టి పనులు మగవారు చేయడము అనుచితమనిన్నీ అధ్యక్షుని రూలింగు ఇవ్వమని ఆవిడ కోరినది. వెంటనే అధ్యక్షుడు ఆమె కోరికను అంగీకరించి రూలింగు ఇచ్చినాడట.